# ఉత్కంఠగా ఓట్ల లెక్కింపు

**● ఉదయం 8గంటల నుంచి ప్రక్రియ**


కౌంటింగ్ కేంద్రంలో కొనసాగుతున్న లెక్కింపు

కొల్లాపూర్, డిసెంబర్ 3: నాగర్‌కర్నూల్ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లో కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపును ఆదివారం అధికారులు చేపట్టారు. బీఆర్ఎస్ నుంచి ఆ పార్టీ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి అభ్యర్థి జూపల్లి కృష్ణారావు, మరో 12మంది అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. అయితే కౌంటింగ్ కేంద్రంలో ఆదివారం ఉదయం 8గంటలకు మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఆ తర్వాత ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు ఆద్యంతం ఉత్కఠభరితంగా సాగింది. కొల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 2,34,167 మంది ఓటర్లు ఉండగా, ఓటింగ్ కోసం 269 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,90,562 ఓట్లు పోలయ్యాయి.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు తిమ్మాజిపేట విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులు

తిమ్మాజిపేట, డిసెంబర్ 3 : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్‌తో ప్రతిభ కనబర్చి రాష్టస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌డీఎఫ్ క్రీడల్లో భాగంగా మహబూబ్‌నగర్‌లో జరిగిన పోటీల్లో బాలుర (అండర్-14) డిస్కస్ త్రోలో ఎనిమిదోవ తరగతి విద్యార్థి కార్తీక్, బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని సరిత, హైజంప్ (అండర్-14)లో జిల్లా మొదటి స్థానం నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల జీహెచ్‌ఎం సత్యనారాయణశెట్టి తదితరులు అభినందించారు.

## 8న పాలెంలో బహిరంగవే లంపాట

బిజినేపల్లి, డిసెంబర్ 3 : మండలంలోని పాలెం గ్రామంలో అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 8న వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రంగారావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయాలకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు నిబంధనల ప్రకారం డీడీలను చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

## ఇక్కడ గెలిస్తే రాష్ట్రంలో అధికారం

అచ్చంపేట రూరల్, డిసెంబర్ 3: అచ్చంపేట నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే రాష్ట్రంలో కూడా ఆ పార్టీ అధికారంలోకి వస్తోంది. ఈ ఆనవాయితీ గతంలో జరిగిన ఎన్నికల్లో రుజువైంది. దీంతో అచ్చొచ్చిన అచ్చంపేటగా రాష్ట్రంలో ఈ నల్లమల ప్రాంతానికి గుర్తింపు వచ్చిందని చెప్పవచ్చు. ఈసారి కూడా (2023) శాసనసభ ఎన్నికల ఫలితాల్లో ఇదే రుజువైంది. అచ్చంపేట నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా 2023 ఎన్నికల్లో డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ విజయం సాధించారు. రాష్ట్రంలో స్పష్టమైన మెజార్టీతో కాంగ్రెస్ విజయం సాధించింది. 1962, 1967, 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందగా ఆ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 1978 ఎన్నికల్లో కాంగ్రెస్ (ఐ) అభ్యర్థి విజయం సాధించగా కాంగ్రెస్(ఐ) రాష్ట్రంలో ప్రభు త్వం ఏర్పాటు చేసింది. 1983, 1985లో తెలుగుదేశం అభ్యర్థులు గెలుపొందగా తెదేపా అధికారంలోకి వచ్చింది. 1989లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించగా ఆ పార్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.1994, 1999లో తెదేపా అభ్యర్థులు గెలుపొందగా తెదేపా అధికారంలోకి వచ్చింది. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందగా రాష్ట్రంలో అదేపార్టీ అధికారంలోకి వచ్చింది. 2009లో ఎన్నికల్లో మాత్రం తెదేపా అభ్యర్థి విజయం సాధించగా రాష్టంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజు రెండు ఎన్నికల్లో విజయం సాధించగా రెండుసార్లు ఆ పార్టీ విజయం సాధించింది. అచ్చంపేట ఎమ్మెల్యేగా డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ 49,326 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అచ్చంపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో గోపిరాం ఎమ్మెల్యే ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని డాక్టర్ వంశీకృష్ణకు అందించారు.

**కల్వకుర్తిలో కశిరెడ్డి..**

కల్వకుర్తి, డిసెంబర్ 3 : శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కశిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధించారు. ఓట్ల లెక్కింపును ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సీవీఆర్ కళాశాలలో చేపట్టారు. ఎన్నికల ఫలితాల అనంతరం రిటర్నింగ్ అధికారి శ్రీనునాయక్ కాంగ్రెస్ అభ్యర్థి కశిరెడ్డి నారాయణరెడ్డికి గెలుపు ధ్రువీకరణపత్రం అందజేశారు. కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించి 2,41,739 ఓట్లకు గాను 2,01,285 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 1,02,730 మంది పురుషులు, 98,546 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ 83.26 శాతంగా నమోదైంది.

**కందనూలులో రాజేశ్‌రెడ్డి..**

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 3 : కందనూలు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి గెలుపొందారు. నియోజకవర్గంలో 2,32,780 మంది ఓటర్లకు గాను 1,83,098 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదివారం నిర్వహించిన కౌంటింగ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డిపై 5,371 ఓట్ల మెజార్టీ సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థికి 80,856 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థికి 85,431 ఓట్లు వచ్చారు. నియోజకవర్గంలో 1519 పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థికి 1,048 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థికి 283 ఓట్లు, ఇతరులకు 146 ఓట్లు పోలయ్యాయి.

**సొంత మండలంలో మర్రికి ఆధిక్యం**

తిమ్మాజిపేట, డిసెంబర్ 3 : బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డికి సొంత మండలం తిమ్మాజిపేటలో ఆధిక్యం లభించింది. మొత్తం 2,162 ఓట్లు వచ్చాయి. మొదటి నుంచి బీఆర్ఎస్ బలంగా ఉండటం, మర్రి సొంతమండలం కావడంతో కాంగ్రెస్ గాలి తట్టుకుని బీఆర్ఎస్ ముందంజ వేసింది. ఇక్కడ 32,616 ఓట్లకు గాను 26,816 ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్‌కు 13,376, కాంగ్రెస్‌కు 11,214 ఓట్లు లభించాయి. గొరిటలో అత్యధికంగా 651 ఓట్ల మెజారిటీ బీఆర్ఎస్‌కు వచ్చింది. మండలంలో మొత్తం 38 బూత్‌లలో 25 బూత్‌లో బీఆర్ఎస్‌కు, 12 బూత్‌లను కాంగ్రెస్‌కు ఆధిక్యం లభించింది.

## రహదారులపై నూర్పిళ్లతో ఇక్కట్లు


ఐతోల్ నుంచి నాగర్‌కర్నూల్ వెళ్లే ప్రధాన రహదారిపై ఆరబోసిన ధాన్యం

తాడూరు, డిసెంబర్ 3 : మండలంలోని ఆయా గ్రామాల్లో గల ప్రధాన రహదారులపై రైతులు వరి ధాన్యాన్ని ఆరబోసి తూర్పారపడుతున్నారు. ప్రమాదమని తెలిసినా రైతులు పట్టించుకోకుండా వరి కుప్పలు రోడ్లపైనే ఆరబోయడం వల్ల వాహన దారులకు, మోటార్ సైకిళ్లపై వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆరబోసిన ధాన్యం పక్కనే రాళ్లను ఏర్పాటు చేయడంతో చాలా వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత యేడు మండలంలోని వివిధ గ్రామాల్లో మోటర్ సైకిళ్లపై వెళ్లే వారు ప్రమాదాలకు గురైన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే.. రోడ్లపై ధాన్యం ఆరబోయవద్దని మండల పోలీసులు కూడా గత సంవత్సరం రైతులకు అవగాహన కల్పించారు. అయినా రాత్రివేళ వరికుప్పలు వేయడంతో మోటర్ సైకిళ్లపై వెళ్లే వారికి దగ్గరికి వచ్చే వరకు రాళ్లు కనిపించక ప్రమాదానికి గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్రభుత్వ దవాఖానలో కాన్పులు సురక్షితం


పాన్‌గల్ పీహెచ్‌సీలో కేసీఆర్ కిట్ అందజేస్తున్న సిబ్బంది

పాన్‌గల్, డిసెంబర్ 3: ప్రభుత్వ దవాఖానలో కాన్పులు సురక్షితమని మండల వైద్యాధికారి చిరంజీవి అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం గ్రామానికి చెందిన గర్భిణి రేణుకకు సాధారణ కాన్పు చేశారు. ఆమె ఆడపిల్లకు జన్మనివ్వగా తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. అనంతరం ఆమెకు కేసీఆర్ కిట్‌ను అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానలో అన్నిరకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేట మీదుగా ఆర్టీసీ బస్సు నడపాలి

పాన్‌గల్, డిసెంబర్ 3: మండలంలోని కొత్తపేట మీదుగా మాందాపూర్, బుసిరెడ్డిపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరారు. కొంతకాలంగా ఆయా గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సును నడపకపోవడంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యపై గతంలో ఆర్టీసీ అధికారులకు విన్నపాలు చేసినప్పటికీ స్పందించడంలేదని తెలిపారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కొత్తపేట మీదుగా ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సును నడిపించాలని కోరారు.

## మైసమ్మ ఆలయానికి భక్తులు


మైసమ్మ దేవతను సందర్శించుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 3: మండల పరిధిలోని నాయినోనిపల్లి మైసమ్మ దేవతను జిల్లా నలుమూలల నుంచి భక్తులు సందర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు సరిపడా వసతులు కల్పించారు. ఈ సందర్భంగా ఆలయానికి కొంతఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ అధికారులు తెలిపారు.

## శ్రీకాంతాచారికి ఘననివాళి



శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యువజన సంఘం సభ్యులు

కడ్తాల్, డిసెంబర్ 3: తెలంగాణ మలిదశ ఉద్యమంలో శ్రీకాంతాచారి బలిదానం మరువలేనిదని యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘువేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో శ్రీకాంతాచారి చేసిన త్యాగం చరిత్రలో లిఖించదగినదని తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం మండలాధ్యక్షుడు కృష్ణయ్య, కురుమ యువచైతన్య సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వివేకానంద యూత్ అధ్యక్షుడు మాధవులు, అశోక్, అనిల్, అహ్మద్ ఉన్నారు.